# పోయిరా మాయమ్మ

– డా. ఊటుకూరి విజ్ఞానేశ్వర కుమార్

మీరు కూడా రారాదూ షాపింగుకీ అని ఆహ్వానించింది శాంతి.

గుండె గుభేలుమంది. ఈ నెలా రెణ్ణెల్లలో ఇది పదోసారో పాతికోసారో ఈ షాపింగు, లెక్కపెట్టటం మానేసాను. అమ్మాయి వెళ్ళేరోజు దగ్గర పడుతోన్న కొద్దీ ఈ షాపింగుదేవతా పూజలు మరీ ఎక్కువై పోతున్నాయి. నా భావాలను, భయాలనూ నా దగ్గరే అట్టే పెట్టుకుని, నేనెందుకు లెద్దూ వచ్చినా అక్కడ ఊరికే కాళ్ళు నొప్పులు పుట్టేటట్టు నిల్చోవడమే గదా అని నీరసంగా ప్రయత్నం చేసాను తప్పించుకోడానికి.

మరేం పర్లేదు రండీ మిమ్మల్ని ఒక్కళ్ళనీ వదిలి వెళితే నాకు బాగోదు అని గోముగా అంది శాంతి. ఇహ లాభం లేదు, వ్యర్థప్రయత్నాలు అనవసరం, వెళ్ళక తప్పదు.

పెళ్ళాం ముద్దుగా షాపింగుకు రావయ్యాని పిలుస్తోంటే ఏవిటీ అంత పోజూ అంటున్నారా? అవును మరి మీకు అలానే అనిపిస్తుంది కానీ మోసేవాడికే గదా కావిడి బరువు తెలిసేది! షాపింగంటే ఒట్టి కాళ్ళనొప్పులేగాదు. తల్లీకూతుళ్ళ షాపింగూ సెలక్షనూ ఒక పెద్ద తంతూ, యజ్ఞం, రభస - మాట పైకి అనగూడదు చూస్తూ భరిస్తూ అలా ఉండిపోవాలి. కాళ్ళ నొప్పులకు తలనొప్పి తోడయినా కిమ్మన గూడదు.

అసలీ హడావుడికంతటికీ మా అమ్మాయి ప్రయాణం నాంది. అమ్మాయిని పంపాల్సి ఉంటుందని తెలిసిన దగ్గర్నుంచీ మా ఆవిడ మధన మొదలయింది. అమ్మాయికి అక్కడ అవసరం ఉంటుందనీ, ఒక్కత్తీ కొత్త ఊళ్ళో నిభాయించుకోలేదనీ, అసలా పిచ్చిమొద్దుకివన్నీ తెలియవనీ - ఒకటనిగాదు పరిపరి విధాల మధనపడిపోసాగింది మాశాంతి. అమ్మాయి వెళుతోంది అలాస్కాకో, సైబీరియాకో గాదు, మన ఊరు లాంటి బోస్టన్ కేనని ఇక్కడ దొరికేవన్నీ అక్కడా దొరుకుతాయనీ చెప్పి చూసాను. అలాస్కానో సైబీరియానో అయితే నయమే అక్కడేమీ దొరకవు గాబట్టి అన్నీ ఇక్కడే కొని తీసుకు వెళుతుందది. బోస్టన్ గాబట్టే అక్కడ ఏ చెత్త కొనేస్తుందోనని నాకు భయం, అని రివర్స్ సమాధానం చెప్పింది. ఇంకేమనగలం? ఏ పని అయినా తన చేత్తో తన ఆలోచనతో చేసుకొంటేగానీ తృప్తి పడని కర్మయోగి మాశాంతి. అసలింకో మాట కూడా మనం చెప్పుకోవాలి - "అమ్మాయి గడప దాటిపోతోందీ నా సెలెక్షనూ టేస్టూ దాని నెత్తిన రుద్దే ఆఖరి అవకాశం ఇదే " అన్న ఆలోచన కూడా మా శాంతి మనసులో ఉండి తీరాలి. మీకేమన్నా అనుమానం ఉంటే ఫ్రాయిడ్ గార్ని అడగండి.

ఫ్రాయిడు గారి సంగతెలావున్నా నాకు మాత్రం రాయబారం నుంచి తిరిగొచ్చిన కృష్ణ పరమాత్మ లాగా "తప్పదు యజ్ఞము ధన బలిన్ నర బలిన్న్న్న్న్న్" అని భూపాల రాగం లో పాడుకుని శనివారం సాయంత్రం శాంతీ, పాపా వాళ్ళతో కలిసి షాపింగ్‌కు వెళ్ళటం తప్పలేదు.

ఏవిటి నాన్నా నువ్వైనా చెప్పకూడదూ అమ్మకి, అలా ఊరుకుంటావేం? అన్న మా పాప అభ్యర్ధనతో నా నిశ్శబ్ద రోదనానికి ఆనకట్ట పడింది. షాపింగు ప్రథమ పాదంలో ఉన్నాం, తల్లీ కూతుళ్ళ వాగ్వివాద్ధం ఆరంభమయి పోయింది. ఏదో దానికిష్టమైనది కొనడం శ్రీమతికి కష్టమవుతోంది. పాప అడిగింది గదా అని, పోనీలే శాంతీ దానికేదిష్టమో అదే తీసుకోనివ్వరాదా? అని భయం భయంగానే వత్తాసు పలికాను. మీరెందుకూ మీరూరుకోండి, మీకేం తెలియదసలు, సంగతేమిటో నేనూ అదీ చూసుకుంటాం అని గదమాయించింది శాంతి. ఠక్కున నోరు మూసాను. ఏంచేస్తాం? కరవమంటే కప్పకు కోపం, విడవమంటే పాముకు కోపం.

మొత్తానికి కిందా మీదా పడి ఓ డజను డ్రస్సులు ఎంచగలిగారు తల్లీ కూతుళ్ళు. రెండో ఘట్టం మొదలయింది, వాళ్ళా డ్రస్సులు తీసుకొని ఫిట్టింగ్ రూమ్స్ వేపు వెళ్ళడం, నేను అప్పటిదాకా వాళ్ళు పోగేసిన బండెడు సామాన్లకూ, ఆ సామాన్లున్న షాపింగ్ కార్ట్‌కూ కాపలా కాయడం. మాతో పాటు వచ్చిన మా బుడతడు కాపలా ఉంటాడులే అని ఏ మేగజైన్ల సెక్షన్ కో వెళ్ళి ఏ "కాస్మోపాలిటన్"నో తిరగేసామో కొంపలు అంటుకొంటాయి. మా బాబిగాడు ఏ కాండీ కొనుక్కోవడానికో, బేస్‌బాల్ కాప్ కొనుక్కోడానికో

ఉడాయిస్తాడు. ఈ లోపల ఆ షాపింగ్ కార్టును కాస్తా షాపువాళ్ళు తీసికెళ్ళిపోయినా, మన సెలక్షన్లు మరో షాపర్ సంగ్రహించినా కొంపలు మునగడం ఖాయం అక్షింతల వర్షం నికరం.

అసలు భార్యలే బండెడు చాకిరీ చేస్తారు అని ఫెమినిస్టులు ఊరికే ఇదయిపోతూ ఉంటారుగానీ మన సంగతి చూడండి. ఒక భర్త భార్యకు ఎన్ని విధాలుగా ఉపయోగపడతాడో ఆలోచించండి. భోజనాలు అయిన తర్వాత గిన్నెలు కడగడం, వారాంతంలో గడ్డి కోయడం, హేమంతంలో స్నో షవెలు చేయడం - ఇవే మగవాళ్ళు చేసే మహా గృహకృత్యాలు అనుకొంటున్నారా? కాదు మహాప్రభో కానే గాదు. అవి బయటకు కనిపించేవి. కనిపించని పనులు కోకొల్లలు. నన్నడగండి చెబుతాను. మా ఆవిడనడగండి చెబుతుంది.

తర్జనభర్జనలు కట్టిపెట్టి యజ్ఞపశువులా షాపింగ్ కార్టుకు కట్టుబడి నిలబడి పోయాను. గత్యంతరం లేదు. పాపం మధ్యలో పావుగంటకోసారి శాంతీనో, మాపాపో వచ్చి "విసుగేస్తోందా ఇంకేం లేదు. ఇదిగో అయిపోయిం, అదిగో అయిపోయింది" అని పలకరించి ఓదార్చి వెళుతూనే ఉన్నారు. అన్నట్టు వాళ్ళ ట్రయిల్ కోసం షాపింగ్ కార్టులో అట్టడుగున ఎక్కడో పడివున్న షర్టో, స్కర్టో వెదికి తీయవలసి వస్తే - అది కూడా మన బాధ్యతే.

మొత్తానికి రెండో ఘట్టం ముగిసింది. కానీ కథ అంతటితో ముగియలేదు సుమా - నిజానికి ముందున్నది ముసళ్ళ పండుగ.

ఫిట్టింగ్ రూమ్ లో ఫిజికల్ ట్రయల్ అయ్యాకా తమ తమ సైజులకు ఏయే డ్రస్‌లు సరిపోయాయో తేల్చుకున్నాకా మొదలవుతుంది ఆఖరి ఘట్టం - ఫైనల్ సెలక్షన్. అప్పటిదాకా మన పాత్ర "గుండమ్మకథ" సినిమాలో హరనాథ్ పాత్రలాంటిదన్నమాట. ఓ షాపింగ్ ఎస్కార్ట్ గా ఓపిగ్గా సహనంతో నోటికీ, మెదడుకూ ఏపనీ చెప్పకుండా ఉత్సవ విగ్రహంలా ఉంటే సరిపోతుంది. కానీ ఈ "అంతిమ నిర్ణయం" సీన్ మనకో అగ్ని పరీక్ష!

ఇది మంచిదా అది మంచిదా? ఇది బావుందా అది బావుందా? ఈరంగు నప్పుతుందా ఆ రంగా? ఇలా సవా లక్ష ప్రశ్నలకు మనం సరైన సమాధానం చెప్పితీరాలి. ఎక్కడ ఏ పొరపాటు జరిగినా, ఏ సెలక్షను ఏ దశలో ఎదురు తన్నినా - వాటన్నిటికీ మనమే బాధ్యులమవుతాం.

నాకు మొదట్లో ఈ రంగంలో ఎలా అభినయించాలో బోధ పడేది కాదు. "ఏవిటీ అభినయమూ, పాత్రా అంటున్నావు ఏ మాత్రం పాత్ర ఉందనీ ఇన్ని నాటకాలూ? ఇన్నిన్ని డైలాగులూ? అంటున్నారా? -

"ఏవండీ ఇరవై డాలర్లలో ఇరవై పర్సెంట్ పోతే ఎంతా ముప్ఫై డాలర్లలో ముప్ఫై పర్సెంట్ పోతే ఎంతా రెండింటిలో ఏది తీసుకుంటే నయమూ?" శాంతి మొదలెడుతుంది యక్షప్రశ్న. నిజానికి ఇది ఏ శాస్త్ర పరిధికీ లొంగని ప్రశ్న. ఇది పదహారూ, అది ఇరవై ఒకటీ అని చెప్పి, అడిగింది కదా అని పదహారు చవక గదా అది తీసుకో అన్నామనుకోండి, మీ చవక బుద్ధులు పోనిచ్చుకున్నారు గాదు నాలుగు డాలర్ల దగ్గర వెనుకాడారు చూడండి ఇప్పుడిది ఎలా అవుటాఫ్ షేప్ అయిపోయిందో అని రేపు విమర్శించవచ్చు. పోనీ అయిదు డాలర్లే గదా ఎక్కువా నీకు నచ్చితే ఇరవై ఒకటిది తీసుకో అన్నామనుకోండి, దాని కోసమని పెద్ద గొప్పగా ఎక్కువ పెట్టి కొనిపించారు. సరిగ్గా చూసి చెప్పక్కర్లేదూ. అక్కడ బాగానే ఉంది. ఇప్పుడు చూడండి ఇంట్లో ఎలా వెలతెలా పోతుందో అన్న విమర్శ ఎదుర్కోవలసి రావచ్చు.

**Heads I win, Tails you loose!**

నిజానికి శాంతి అనకుండా అంటున్నది ఏవిటంటే "ఓ ప్రాణనాథా, ఓ మబ్బు మొహమా, డాలర్ల లెక్కలు పక్కన పెట్టూ రెండూ కొనిపెట్టూ" అని. ఇది అర్థం కావాలంటే మేధస్సూ గణిత శాస్త్ర పరిజ్ఞానమూ చాలవు, జీవన శాస్త్రం అర్థం కావాలి. జీవశాస్త్రం గాదు - జీవన శాస్త్రం. బతుకు రీతికి సంబంధించిన శాస్త్రం. ఓ మిలియన్ మెగా ఫ్లాప్ కంప్యూటరుక్కూడా దిమ్మ తిరిగే శాస్త్రం. సహధర్మచారిణి మనోగతం అర్థం చేసుకొని, "రెండూ కొనవోయ్" అని సలహా ఇస్తే ఇష్టదేవతా సంతృప్తి జరుగుతుంది, గృహం స్వర్గసీమ అవుతుంది, మర్నాడుదయం అల్లం పచ్చిమిరపకాయల తో పెసరట్లకు నాందీ ప్రస్థావన జరుగుతుంది, రెండు మూడు రోజులు బ్రెడ్డూ కార్న్ ఫ్లేక్స్ కి స్వస్తి వాచకం చెప్పటం

జరుగుతుందీ. చాలా లాభాలున్నయి ఈ జీవన శాస్త్రం నేర్చుకోవడం వల్లా "ఫర్లేదు, రెండూ కొనేసేయ్" అనడం వల్లా.

మీకు అనుమానం రావచ్చు. "వెధవ పెసరట్ల కోసం ఎందుకీ రాజీ బతుకూ? హాయిగా ఇంట్లో ఉండిపోయి ఏ ఇండియన్ గ్రాసరీ స్టోర్లోనో కొన్న పెసళ్ళని ఇండియానుంచి తెచ్చుకొన్న సుమీత్ మిక్సీలో వేసి రుబ్బుకొని టెఫ్లాన్ పెనం మీదో వీరోచితంగా పోసుకొని స్వేచ్ఛగా, స్వతంత్రంగా స్వయం కృషితో స్వయంతృప్తితో జీవితం గడపలేమా?" అని. అలాటి మాటలన్నారంటే మీరు పెళ్ళీ పెటాకుల్లేని బ్రహ్మచారులో, అన్నీ వదిలేసిన సన్యాసులో అన్నమాట. నే చెప్తోంది గృహస్థ జీవన శాస్త్రం గురించి. అక్కడ ఈ ముదురు బెండకాయ థీరీలు పనికి రావు!

చివరికి రెండూ కొన్నాం. రెండేనేమిటీ మరో రెండు డజన్లు కొన్నాం. నాకు తెలుసు శాంతి పెసరట్లూ స్వర్గసీమా - ఇవి క్షణికం తాత్కాలికం. నెల చివర ప్రమాదాలు పొంచి ఉన్నాయి. అమెరికన్ ఎక్స్ప్రెస్ బిల్లు వస్తుంది. వీసా కార్డ్ పీకల దాకా మునిగి మన కొంప ముంచుతుంది. మాగ్జిమమ్ లిమిట్కు చేరుతుంది. జారుతోన్న కాళ్ళజోడులోంచి వాటికేసి జాలిగా చూసి, "ఏవిటిది శాంతా" అంటాను" రోజు మీరే గదా రెండూ కొనుక్కోమన్నది" అన్న సమాధానం ఠక్కున వస్తుంది. యజ్ఞాలు ముగుస్తాయి త్యాగాలూ ముగుస్తాయి ధనబలి జరిగిపోతుంది బలిపశువును నేనవుతాను.

మా అమ్మాయికి చిన్న గిన్నెలు, పెద్ద గిన్నెలు, పరుచుకోనే కార్పెట్లు, తగిలించుకొనే పెయింటిగులూ, పై బట్టలూ, లో బట్టలూ, కట్టుడు బట్టలూ, పెట్టుడు బట్టలూ, పదహారు డాలర్ల బట్టలూ, ఇరవై ఒక్క డాలర్ల బట్టలూ, రెండూ కలిస్తే ముఫ్ఫై ఏడు డాలర్ల బట్టలూ అంతా కలిసి నన్ను ముంచేసే బట్టలూ అన్నీ చేర్తాయి. అన్నింటి తోనూ రథమంత స్టేషన్ వాగనూ నింపేసి కరుణించి నాకు రియర్ వ్యూ మిర్రరు లో కనిపించడానికి దమ్మిడీ కాసంత జాగా మాత్రం వదిలిపెడ్తారు తల్లీకూతుళ్ళు.

రథం కదుల్తుంది, "పోయిరా మాయమ్మ పోయిరావమ్మా పోయిరా మాయమ్మ కాలేజీ చదువుకూ" అంటూ మా ఆవిడ కూతురికి వీడ్కోలు పలుకుతుంది.

***